ప్రజాశక్తి
సోమవారం 28 అక్టోబర్ 2024 8 పేజీలు



ప్రకాశం




బాపట్ల

వద్దన్నా.. ఆమోదించారు..

చైర్మన్ చిర్లంచెర్ల ఏకపక్ష తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో కౌన్సిలర్ల మాటకు విలువ లేకుండా పోయింది. కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన అజెండాలోని కొన్ని అంశాలను మెజార్టీ కౌన్సిలర్లు ఆమోదించవద్దని కోరినా ఫలితం లేకుండా పోయింది. కౌన్సిలర్లు వద్దన్న అంశాలను ఆమోదింపజేసి మరోసారి ఏకపక్ష తీరును ప్రదర్శించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ.



మున్సిపల్ కార్యాలయం

మున్సిపాలిటీలో అంతా తానే అన్నట్లు చైర్మన్ చిర్లంచెర్ల వ్యవహరిస్తున్నారని స్వపక్ష కౌన్సిలర్లు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. చైర్మన్ చిర్లంచెర్ల ఆది నుంచి ఏకపక్షంగా వెళుతున్నారని, స్వపక్ష కౌన్సిలర్లు అసహనంతో ఉన్నారు. వైసిపి పెద్దల వద్ద పంచాయతీ పెట్టినా చైర్మన్ చిర్లంచెర్ల వ్యవహారశైలిలో ఎలాంటి మార్పు లేదు. ఈ కారణంగా గత నెల మినహా అంతకు ముందు రెండు నెలల్లో జరగాల్సిన రెండు కౌన్సిల్ సమావేశాలకు స్వపక్ష కౌన్సిలర్లు మూకుమ్మడిగా డుమ్మా కొట్టారు కోరం లేని కారణంగా రెండు నెలల పాటు కౌన్సిల్ సమావేశాలు జరగలేదు. మూడో సమావేశం జరగని పక్షంలో కౌన్సిల్ రద్దు అవుతుందని భావించిన కౌన్సిలర్లు గత నెల చివరలో మూడో సమావేశానికి స్వపక్షానికి చెందిన వైసిపి కౌన్సిలర్లు అందరూ హాజరవ్వడంతో ఎట్టకేలకూ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో 24 అంశాలతో అజెండా ప్రవేశపెట్టారు. అందులో అధికార 2లో

పంట చేతికందేది గగనమే..

- అకాల వర్షాలు
- కరువుతో పంటలకు తీవ్రనష్టం
- ఇపుడు ఆశాజనకంగానే రబీ
- వాతావరణం అనుకూలిస్తేనే ఫలితం

ఏటా ఏదోక విపత్తు.. రైతులను వెంటాడుతూనే ఉంది. ఒసారి కరువు.. మరోసారి అకాల వర్షాలు లేదా తుఫానుల వల్ల చేతి కందే దశలో పంటలు నీటిపాలవుతున్నాయి. నాలుగేళ్లలో వరుసగా రెండేళ్లు ఇలాంటి పరిస్థితులే ఎదురైయ్యాయి.



వర్షానికి నీట మునిగిన మిర్చి పంట (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

.ఒక పంటపై రైతులకు కొంత మేర ఊరట కలిగితే మిగిలిన పంటల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఈఏడాది పొగాకు పంట గెట్టెక్కించగా మిగతా పంటల వల్ల మిగిలిందేమీలేదంటున్నారు రైతులు. గడిచిన రెండేళ్లలో వ్యవసాయ రంగంలో పరిస్థితులను విశ్లేషిస్తే గతేడాది ఖరీఫ్ కొంత సజావుగా సాగినా రబీని కరువు వెంటాడింది. పంటలు సాగు చేసిన తర్వాత వర్షాలు లేక కరువు పరిస్థితులు సంభవించాయి. పంటలు నిలువునా ఎండిపోయాయి. కేంద్ర బృందాలు కూడా కరువు పరిశీలనకు వచ్చాయి. ఎన్నికల ఏడాది కావడంతో రైతులను పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇప్పటికీ గతేడాది రబీలో జరిగిన నష్టానికి పరిహారం రాలేదంటే ఆశ్చర్యం లేదు. 29,713 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు తేల్చారు.36,147 మంది రైతులను బాధితులుగా గుర్తించారు.వీరికి పరిహారం కోసం రూ.30 కోట్లు కావాలని వ్యవసాయశాఖ అధికారులు నివేదికలు పంపారు. ఖరీఫ్ సీజన్ పోయి మళ్లీ రబీ వచ్చినా పరిహారం రాలేదు. రైతులు కూడా మరిచిపోయారు. ఈఏడాది ఖరీఫ్ కూడా కలిసిరాలేదు. వర్షాలు సజావుగానే పడ్డట్టు కనిపించినా అదును సమయంలో కురవలేదు. రైతు లకు సానుకూలత కనిపించలేదు. ఖరీఫ్ సాగుకు సెప్టెంబరు నాటికి గడువు ముగిసినా సాగు 45 శాతం కూడా మించలేదు. 4,99,757 ఎకరాల సాధారణ విస్తీర్ణంగానూ 2,24,944 ఎకరాల్లో పంటలు సాగయినట్లు వ్యవసాయశాఖ అధికారులు గణాంకాల్లో తేల్చారు. ఖరీఫ్‌ను అకాల వర్షాలు ముంచాయి.ఆగస్టులో వచ్చిన భారీ వర్షాలకు బాపట్ల జిల్లాలో భారీగా పంటనష్టం జరిగింది. అప్పుడు ప్రకాశం జిల్లాలో పెద్దగా నష్టం లేకపోయినప్పటికీ మొన్న కురిసిన వర్షాలకు నష్టం తప్పలేదు.9,252 హెక్టార్లలో 8,439 మంది రైతులు నష్టపోయినట్లు తాజాగా లెక్కలు తేల్చారు.ఇక బాపట్ల జిల్లాలో చూస్తే 53 వేల ఎకరాల్లో నష్టం జరిగింది. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం వర్షాలకు జరిగిన నష్టాలపై వెంటనే స్పందించింది. రూ.57.98 కోట్లు పరిహారం కూడా ఇటీవలే విడుదల చేశారు. ఖరీఫ్, రబీని ఏదో తరహాలో అటు కరవు లేకుంటే వర్షాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇపుడు రబీ సీజన్ వచ్చింది. ప్రస్తుతం పంటల సాగు మొదలైంది.ముమ్మరం కావాల్సి ఉంది.పొగాకు , వరి, మిర్చి,శనగ పంటలు పెద్దఎత్తున సాగవుతాయి. ఈ ఏడాది వర్షాలు కూడా సాధారణంగానే ఉన్నాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకూ సాధారణ వర్షపాతం 366 మిమిగానూ అదే స్థాయిలో పడింది. ఈనెలలోనూ వర్షాలు ఆశానకంగానే ఉన్నాయి. ఎక్కువగానే పడ్డాయి. ప్రస్తుతం రబీలో సాధారణ విస్తీర్ణం 3,97,880 ఎకరాలకుగానూ ఇప్పటి వరకూ 51,794 ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. వరినాట్లు మొదలు కావాల్సి ఉంది. వాణిజ్య 2లో

రాయితీకి మంగళం

- నిలిచిన టార్పాలిన్ పట్టల సరఫరా
- తడుస్తున్న పంటలు
- రైతులకు తప్పని నష్టాలు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు స్తంభవించినప్పుడు కాపాడుకునేందుకు గతంలో ప్రభుత్వం రాయితీపై టార్పాలిన్ పట్టలు అందజేసేంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాన్ని నిలుపుదల చేసింది. దీంతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు.

ఇటీవల అకాల వర్షాలు కురిశాయి. పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం, మిరప, మొక్కజొన్న, పత్తి, మినుములు, కందులు తడిసిపోకుండా కాపాడుకోవడానికి రైతులు నానా అగచాట్లు పడాల్సి వచ్చింది. తమ వద్దనున్న పాత, చినిగిపోయిన టార్పాలిన్లు కప్పి రక్షణ కల్పించేందుకు ఎంత ప్రయత్నించినా ఉపయోగం లేకపోయింది. ధాన్యం పత్తి తడిసిపోయి తీవ్రంగా నష్టపోయారు. మరికొందరు అద్దెకు పట్టలు దొరకుతా యేమోనని పరుగులు పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. టార్పాలిన్లు లేక పంటలు నష్టపోయామని, ధాన్యం, ఎండు మిరప కాయలు తడిసిపోయి రంగు మారిందని రైతులు విలవిల్లాడారు.

జిల్లాలో ఖరీఫ్ సాగు వివరాలు..

జిల్లాలో కంది సాధారణ సాగు 73,003 హెకార్లు కాగా 17,441.5 హెక్టార్లలో సాగైంది. పత్తి సాధారణ సాగు 31,562 హెక్టార్లు కాగా 8,387.59 హెక్టార్లలో సాగైంది. మిర్చి సాధారణ సాగు 23,873 హెక్టార్లు 767.65 హెక్టార్లలో సాగైంది. వరి సాధారణ సాగు 14,078 హెక్టార్లు కాగా 1,007.80 హెక్టార్లలో సాగైంది.సజ్జ సాధారణ సాగు 7,125 హెక్టార్లు కాగా 4,046 హెక్టార్లలో సాగైంది. నువ్వులు సాధారణ సాగు 2,790 హెక్టార్లు కాగా 2,828.70 హెక్టార్లలో సాగైంది. మొక్కజొన్న సాధారణ సాగు 2,464 హెక్టార్లు కాగా 1,985.42 హెక్టార్లలో సాగైంది.మినుములు సాధారణ సాగు 2,520 హెక్టార్లు 250 హెక్టార్లలో మాత్రమే సాగైంది.

రాయితీలేక.. రైతుపై భారం..

పంట దిగుబడులు చేతికొచ్చే దశలో వర్షాలు పడితే ఈ పట్టలకు విపరీతమైన డిమాండు ఉంటుంది. దీనిని గుర్తించిన గత ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాయితీ పట్టలకు మంగళం పాడింది. దీంతో రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రాయితీ మీద పంపిణీ చేయకపోవడంతో తయారీదారులు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కర్షకులు అధిక ధర వెచ్చించి కొనుగోలు చేయాల్సిన 2లో

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్లు అదుర్స్

- బాలుర జట్టుకు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం
- తృతీయ స్థానంలో నిలిచిన బాలికల జట్టు



ప్రథమ స్థానం సాధించిన బాలుర జట్టు.

పజాశక్తి - పంగులూరు

జూనియర్ బాలుర, బాలికల 43వ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర, బాలికల జట్లు ఉత్తమ ప్రతిభను చూపాయి. బాలుర జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. బాలికల జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. 43వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈనెల 25 నుంచి 27 వరకూ నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలుర జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ జట్టు ప్రథమ స్థానం సాధించడం ఇది వరుసగా ఏడవసారి అని ఖోఖో రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు.ఈ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన ప్రకాశం బాలురు జట్టును తతీయ స్థానం సాధించిన ప్రకాశం బాలికల జట్టును పూతలపట్టు ఎమ్మెల్యే కె.మురళీమోహన్, చిత్తూరు ఎంపీ జి.ప్రసాదరావు, శాప్ చైర్మన్ రవి నాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, ప్రకాశం జిల్లా ఖోఖో కార్యదర్శి కాశీ విశ్వనాథరెడ్డి , కోచ్ డిఎల్.రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంక్షేమం కోసం పోరాటాలు

యుటిఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఓవీ వీరారెడ్డి



సభలో మాట్లాడుతున్న వీరారెడ్డి

ప్రజాశక్తి-పొదిలి / కొనకనమిట్ల

ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యుటిఎఫ్ అనేక పోరాటాలు చేసిందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓవీ వీరారెడ్డి అన్నారు. ఆదివారం యుటిఎఫ్ కొనకనమిట్ల మండల శాఖ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ మహాసభలు పొదిలి పట్టణంలోని వివేకానంద డిగ్రీ కాలేజీలో జరిగాయి. మండల శాఖ అధ్యక్షులు ఎస్‌కె నాసర్ మహమ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓవీ వీరారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించి 50 సంవత్సరాలయిన సందర్భంగా మండల మహాసభలు జరుగుతున్నాయని అన్నారు. ఉపాధ్యాయ సంక్షేమం కోసం యుటిఎఫ్ అనేక పోరాటాలు చేయడం వలన అప్రెంటీస్ విధానం రద్దు, కౌన్సెలింగ్ విధానం అమలు, ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం, రీ గ్రూపింగ్ స్కేల్ మొదలైన అంశాలను సాధించినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 115ను రద్దుచేసి ప్రభుత్వ విద్యారంగ వ్యవస్థను కాపాడాలన్నారు. సంబరాలు సందర్భంగా ఉపాధ్యాయులకు ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించినారు. మండల విద్యాశాఖ అధికారి బి నరసింహారావు మాట్లాడుతూ సంఘటిత పోరాటంతోనే ఉద్యోగుల, ఉపాధ్యాయుల మనుగడ సాధ్యమవుతుందని అన్నారు. జిల్లా సహాధ్యక్షులు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం అనేక పోరాటాలు చేయడం వలన నేడు సిపిఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యూటీ మొదలగు సౌకర్యాలు లభించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి బాల వెంకటేశ్వర్లు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ కామేశ్వరరావు, యుద్ధం శ్రీనివాసులు, టి నరసింహారావు, వైఎస్ఎన్ జ్యోతి, వై హరిబాబు, పి శ్రీనివాస్‌రెడ్డి, కె తిరుపతిరెడ్డి, పి విజయలక్ష్మి, టి పద్మ, గాయత్రి, అపరంజి కుమారి, ఎస్‌కె ఖాసింసా, బి కృపారావు, ఆంజనేయ చౌదరి, కె నరసింహారావు, ఆర్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఏ బాదుల్లా, మదార్‌వలి, తోట తిరుపతయ్య, ఆళ వెంకటేశ్వర్లు, కే విజయలక్ష్మి, చిన్నమ్మాయి మొదలగు రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఎన్నికల అధికారి పి బాల వెంకటేశ్వర్లు, ఎన్నికల పరిశీలకులుగా షేక్ అబ్దుల్ హై వ్యవహరించారు.

నూతన కమిటీ ఇదే!

యుటిఎఫ్ కొనకనమిట్ల మండల గౌరవ అధ్యక్షులుగా యుద్ధం శ్రీనివాసులు, అధ్యక్షులుగా కె నాసర్ మహమ్మద్, మండల సహాధ్యక్షులుగా టి నరసింహారావు, సహాధ్యక్షురాలుగా వైఎస్ఎన్ జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా ఎస్ కామేశ్వరరావు, కోశాధికారిగా వై హరిబాబు, మహిళా కార్యదర్శిగా పి విజయలక్ష్మి, మహిళా కమిటీ కన్వీనర్‌గా టి పద్మ, గాయత్రి, కో కన్వీనర్‌గా జి అపరంజికుమారి, కుటుంబ సంక్షేమ పథకం కన్వీనర్‌గా టిసిహెచ్ బాబురావు, కో కన్వీనర్‌గా ఎస్‌కె ఖాసింసా, జిల్లా కౌన్సిలర్‌గా జి భారతీదేవి, పి శైలజ, బి కృపారావు, పి శ్రీనివాస్‌రెడ్డి, పి ఆంజనేయ చౌదరి, కే తిరుపతిరెడ్డి, కే నరసింహారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాయితీకి మంగళం

(మొదటిపేజీ తరువాయి)

దుస్థితి నెలకొంది. గత టిడిపి ప్రభుత్వం హయాంలో నాణ్యమైన టార్పాలిన్ పట్ట ధర రూ.2,400 ఉండేది. రాయితీతో రూ.800లకే రైతులకు అందించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాయితీ పట్టలు పంపిణీ చేయలేదు. ఆ పథకానికి మంగళం పాడేసింది. ప్రస్తుతం మార్కెట్లో టార్పాలిన్ నాణ్యత తక్కువగా ఉండేవి రూ.2 వేల నుంచి రూ.2,500 ఉండగా, నాణ్యమైన పట్ట రూ. 3 వేలు ధర పలుకుతోంది. నాణ్యమైన పట్ట కొనుగోలు చేయాలంటే రైతుకు భారంగా మారింది. ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తే రైతుపై భారం తగ్గుతుంది.

రైతుకు ఎంతో అవసరం..

ఖరీఫ్, రబీ సీజన్లో పంట ఉత్పత్తులను ఆరుబయట ఉంచినప్పుడు వర్షం, మంచు నుంచి కాపాడుకోవడానికి ప్రతి రైతుకూ పట్టలు అవసరం. తుపానులు, వాయుగుండాలు ఏర్పడినప్పుడు పంట చేజారిపోకుండా టార్పాలిన్లు ద్వారా కాపాడుకుంటారు. అనుకోకుండా వచ్చే వర్షాల సమయంలో పంట ఉత్పత్తులు ఆరబెట్టే ప్రాంతంలోనే పట్టలు సిద్ధంగా ఉంచుకుంటారు. ఇంత కీలకమైన పట్టలను ప్రభుత్వం రాయితీపై అందించి ఆదుకోవాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా గత ప్రభుత్వం ఐదేళ్లుగా రైతులకు పట్టలను పంపిణీ చేయకుండా వారిపై అదనపు భారం పడేలా చేస్తోంది. యర్రగొండపాలెం నియోజకవర్గంలో అధికంగా వరి, కంది, పత్తి, మిరప, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు పండిస్తారు. ఖరీఫ్ సీజన్ చివరి రోజుల్లో వర్షాలు బాగా కురుస్తున్నాయి. కళ్లాల్లో ధాన్యంతో పాటు ఇతర పంటలు తడిసిపోతున్నాయి. రాత్రి వేళ టార్పాలిన్లు కప్పి పగటి వేళ తొలగిస్తుంటారు. దీని వల్ల మంచు, వర్షం నుంచి కాపాడుకొంటారు.

పంటల నూర్పిడి తరువాత..

పంటల నూర్పిడి తరువాత ధాన్యం ఆరబెట్టుకునే సమయంలో వర్షాలు వస్తే నష్టపోకుండా టార్పాలిన్లు కాపాడతాయని రైతులు తెలిపారు. మొక్కజొన్న పండించే రైతులు కూడా పట్టల మీద వర్షాలు వచ్చినపుడు ఆధారపడతారు. అయితే ప్రభుత్వం గత ఐదేళ్లుగా టార్పాలిన్ పట్టాలను రాయిపై ఇవ్వడం లేదు. వర్షాల నేపథ్యంలో టార్పాలిన్లను రైతులు కొనుగోలు చేసుకోక తప్పలేదు. దీంతో నాణ్యత, పరిమాణాన్ని బట్టి రూ. నాలుగు నుంచి పదివేల వరకూ అదనంగా ఖర్చు పెట్టక తప్పలేదని రైతులు వాపోతున్నారు. కూటమి పభుత్వమైనా రాయితీ టార్పాలిన్లు అందించే పథకాన్ని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

పట్టలు లేక నష్టపోయాం

వెంకట సుబ్బయ్య, రైతు, మల్లాపాలెం



ఒకటిన్నర ఎకరాలో రూ.50 వేలు ఖర్చుపెట్టి పత్తి పంట సాగు చేశా. పంట కోతకు వచ్చి దశలో ఎడతెరపి లేకుండా వర్షం పడటంతో 80 శాతం పంటంతా తడిసి పోయింది. నల్లగా కాయలు మారాయి. ప్రభుత్వం రాయితీ పై పట్టలు ఇవ్వకపోవడంతో నష్టపోవాల్సి వచ్చింది.

అధిక ధరలతో కొనుగోలు చేయాల్సి వస్తోంది

నక్కా తిరుపతయ్య, రైతు, గంగాపాలెం



ప్రభుత్వం టార్పాలిన్ పట్టలను రాయితీపై అందించకపోవడంతో అధిక ధరలతో కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి తడిసి గుడ్డి పత్తిగా మారి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అధిక ధరలకు టార్ఫాలిన్ పట్టలు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ప్రభుత్వం ఆదుకోవాలి

జూపల్లి వెంకటేశ్వర్లు, రైతు, యర్రగొండపాలెం



గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు టార్ఫాలిన్ పట్టలు రాయితీపై పంపిణీ చేసింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయితీకి మంగళం పలికింది. దీంతో రైతులు అప్పులు చేసి పట్టలు కొనుగోలు చేయాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వమైనా రాయితీపై రైతులకు టార్ఫాలిన్ పట్టలు పంపిణీ చేసి ఆదుకోవాలి.

పంట చేతికందేది గగనమే..

(మొదటిపేజీ తరువాయి)

పంటలైన పొగాకు,శనగ, పత్తి,మిర్చి వేలాది ఎకరాల్లో సాగు అవుతాయి. రబీని ఈ ఏడాది ఏ విపత్తు వెంటాడక పోతేనే రైతులు బయటపడతారు. డిశంబరులో మళ్లీ తుఫానులు వంటివి వస్తే నష్టం తప్పదు. అదే సమయంలో సకాలంలో రానున్న రెండు నెలలూ వర్షాలు కూడా అవసరం మేరకు కురిస్తేనే పంటలకు మేలు జరుగుతుంది. గతేడాది రబీని కరువు వెంటాడింది. వేలాది ఎకరాల్లో నష్టం జరిగింది. దిగుబడులు కూడా తగ్గాయి. గతేడాది వరిసాగు లేదు. ఈ ఏడాది సాగర్ కాలువలకు నీరు ఉన్నందున వరి, ఆరుతడి పంటలకు పరిస్థితి అనుకూలంగా ఉంది. కేవలం వర్షాలపైనే ఆధారపడకుండా సాగర్ జలాలు ఊరట కలిగిస్తాయి. గుండ్లకమ్మ నీటిని కూడా వినియోగించు కుంటే 80 వేల ఎకరాలకు ఆరుతడికి నీరు అందుతుంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు వ్యవసాయంపై సమగ్రంగా దృష్టిసారించాల్సిన అవసరముంది.

సరైన పత్రాలు ఉంటేనే ప్రయాణించాలి: సిఐ



వాహనాలు తనిఖీ చేస్తున్న సిఐ, ఎస్ఐలు

ప్రజాశక్తి-పొదిలి

సరైన పత్రాలు లేకుండా వాహన చోదకులు ప్రయాణాలు చేయవద్దని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. రోజురోజుకూ ప్రమాదాల బారిన పడే వారి సంఖ్య పెరుగుతోందని, అందుకు ప్రధానంగా వాహనాలు నడపడంలో అవగాహన లేకపోవడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే రోడ్డమీదకు రావడం కారణంగా ఉందన్నారు. వీటికి తోడు మద్యం సేవించి వాహనాలు నడిపే వారివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అందుకోసం వాహన చోదకులు పోలీసులకు సహకరించాలన్నారు. వాహన చోదకులు తమకు, వాహనానికి రవాణా శాఖ వారు నిర్దేశించిన సరైన పత్రాలు ప్రయాణంలో వెంట కలిగి ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకునేందుకు తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాలలో ఎవరినైనా ఇబ్బంది గురి చేసినా జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా విశ్వనాథపురం సాయి పెట్రోల్ దగ్గర సరైన పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. వారికి ప్రమాదాల గురించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ వాహన తనిఖీలలో భాగంగా సీఐ టివెంకటేశ్వర్లుతో పాటు పాల్గొన్న ఎస్ఐ వి వేమన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వద్దన్నా.. ఆమోదించారు..

(మొదటిపేజీ తరువాయి)

టిడిపి పెద్దలు చెప్పిన పనులను అజెండాలో మెజార్టీగా చేర్చారు. ఇక్కడ వైసిపి పాలకపక్షంలో ఉన్నా... టిడిపి నేతలు... వైసిపి ప్రజా ప్రతినిధులకు తగిన ప్రాధాన్యత, విలువ ఇవ్వని పక్షంలో అజెండాలోని కొన్నింటిని నిలుపుదల చేయాలని పట్టుబట్టారు. గత నెల అజెండాలోని 1, 2, 5, 6, 7, 8, 9, 10, 15, 16, 17, 18, 22, 23, 24వ అంశాలను ఆమోదించవద్దని స్వపక్ష కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. చైర్మన్ చిర్లంచెర్ల కూడా కౌన్సిలర్ల అభిప్రాయాలను ఏకీభవిస్తున్నామని చెప్పారు. పైన పేర్కొన్న అంశాలను ఆమోదించడం లేదని కౌన్సిల్‌కు తెలిపారు. అనంతరం చోటు చేసుకున్న పరిణామాలు కౌన్సిలర్లను విస్తుపోయేలా చేశాయి. వద్దన్న అంశాల్లో నాలుగు మినహా మిగిలినవన్నీ ఆమోదించడంతో కౌన్సిలర్లకు విలువ లేకుండా పోయింది. చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ అధికార టిడిపితో కుమ్మక్కు కావడంతో ఈ తతంగం జరిగిందని ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై మున్సిపల్ కౌన్సిలర్లలో తీవ్ర చర్చ జరుగుతోంది. వచ్చే కౌన్సిల్ సమావేశంలో స్వపక్షం నుంచే చైర్మన్ బాలమురళీకృష్ణ గందరగోళ పరిస్థితులు ఎదుర్కొంటారని ప్రస్తుత పరిస్థితిని బట్టి తెలుస్తోంది.!



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కోటయ్య

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-పీసీపల్లి

సైబర్ నేరాలపై స్థానిక ఎస్ఐ జి కోటయ్య ఆదివారం అవగాహన కల్పించారు. మండలంలోని గుంటుపల్లి, మూలేవారిపల్లి గ్రామాల్లో ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా ఎక్కడ కూడా బెల్ట్ షాపులు నిర్వహించొద్దని అన్నారు. బెల్టు షాపులు నిర్వహించినా, అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గ్రోమోర్‌లో మాయాజాలం

డిఎపి, యూరియా కావాలంటే అవసరం లేనివి కూడా తీసుకోవాలని షరతు

- తీవ్రంగా నష్టపోతున్న రైతులు - పట్టించుకోని అధికారులు



ఎరువుల కోసం వచ్చిన రైతులు



నాగులుప్పలపాడులోని గ్రోమోర్ కేంద్రం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరులోని గ్రోమోర్ ఎరువుల దుకాణంలో మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. రైతులకు అవసరమైన డిఎపి, యూరియా కావాలంటే.. మేము ఇచ్చే దుబ్బు గుళికలు, మైక్రో న్యూట్రిషన్ కూడా తీసుకుంటేనే ఇస్తామని లింకు పెడుతున్నారు. లేకుంటే ఒక్క బస్తా కూడా ఇచ్చే ప్రసక్తే లేదని ఖరాఖండిగా చెబుతున్నారు. దీంతో రైతులు అవి మేము ఏమి చేసుకుంటామని వెనుతిరుగుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదలతో పంటలన్నీ నీటమునిగి మండలంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. అరకొరగా ఉన్న కొద్దిపాటి పంటలను కాపాడుకుందాం అని రైతులు ఎరువుల కోసం వస్తే గ్రోమోర్ వాళ్ల లింకు పెట్టడమేమిటని ఆందోళన చెందుతున్నారు మూలిగే నక్కపై తాటికాయ పడ్డ సామెతగా వ్యవసాయ ఖర్చులు, సాగు ఖర్చులు పెరిగి రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. వ్యవసాయం నష్టదాయకంగా ఉన్న తరుణంలో ఈ విధంగా అవసరం లేని ఉత్పత్తులు అంటకట్టడానికి ప్రయత్నం చేయడం చాలా బాధాకరమైన విషయమని రైతులు వాపోతున్నారు. ఈ సంఘటనపై పలుమార్లు మండల వ్యవసాయాధికారి దృష్టికి తీసుకువెళ్ళినా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అక్కడ కాకపోతే మరొక షాపులో కొనుక్కోండి అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని గ్రోమోర్‌పై చర్యలు తీసుకోవాలని రైతులు రాయపూడి సుదర్శనం, పెంటాల శ్రీనివాసరావు, ఏలియా, ఏబు రాపర్ల రాంబాబు తదితర రైతులు కోరుతున్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

మృతులకు ఎమ్మెల్యే తాటిపర్తి నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యర్రగొండపాలెం పట్టణానికి చెందిన షేక్ నూర్ అహ్మద్, అప్రోజ్‌లకు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నివాళులర్పించారు. ప్రభుత్వ ఏరియా వైద్యశాల వైద్యులతో మాట్లాడి పోస్టుమార్టం త్వరగా జరిగేలా కృషి చేశారు. అనంతరం యువకుల మృతదేహాలకు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని మసీదులో జరిగిన జనాజా నమాజును చదివి ముస్లింలతో కలిసి పాడె మోశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ జిలాని, సయ్యద్ జబివుల్లా, షేక్ ఇస్మాయిల్, మొగల్ కరిముల్లా బేగ్, వైసీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధిక శబ్ధాలతో వాహనాలు నడిపితే చర్యలు


ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎక్కువ శబ్దాలతో వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యర్రగొండపాలెం ఎస్ఐ పి.చౌడయ్య హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సైలెన్సర్లు అమ్మే వ్యాపారులకు సైతం అవగాహన కల్పించినట్లు తెలిపారు. అతిగా శబ్దం చేసే సైలెన్సర్లతో వాహనదారులు పట్టుబడితే తొలిసారి రూ.వెయ్యి జరిమానా విధిస్తామన్నారు. రెండోసారి పట్టుబడితే రూ.2 వేలు జరిమానా విధించనున్నట్లు చెప్పారు. వరుసగా ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన హారన్ సౌండ్, సైలెన్సర్ ఎలా ఉండాలని అని రీసెర్చ్ చేసిన తర్వాత కంపెనీలు బైక్‌లకు తయారు చేస్తారన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అన్నారు. మార్కాపురం మండలంలోని మిట్టమీదపల్లి, తిప్పాయపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడిపై శనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందుల ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమ పంట పొలాలను ఇ-క్రాప్‌లో నమోదు చేయించుకో వాలన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ ఆధ్వ ర్యంలో పంటనష్టం అంచనాలు తయారు చేయ టం జరుగుతుందని తెలిపారు. రెండు రోజుల్లో రాష్ట్ర మంత్రులు, జిల్లాలోని ఎమ్మెల్యేలు వెలుగొండ ప్రాజెక్టును సందర్శించనున్నారని, వచ్చే బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్ట పూర్తి చేయడానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. త్వరలోనే వెలుగొండ ప్రాజెక్ట పూర్తి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు కె.శ్రీనివాసరావు, ఏడీఏ బాలాజీ నాయక్, మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు జవ్వాజి రామాంజుల రెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పొన్నలూరు: పొన్నలూరు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలలో సోమవారం నుండి రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి పూర్ణచంద్రరాబు తెలిపారు. అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, బయోమెట్రిక్ ద్వారా రైతు భరోసా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మండలానికి ఎర్ర శనగ విత్తనాలు 4,437 క్వింటాళ్ల, తెల్ల శనగలు 808 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు కారుమంచి కాలువ షట్టర్లు ప్రారంభం

ప్రజాశక్తి-చీమకుర్తి



ప్రారంభానికి సిద్ధమైన షట్టర్లు

నల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కారుమంచి మేజర్ సాగర్ కాలువ తూముకు బిగించిన నూతన షట్టర్లను నల్లూరి ఫౌండేషన్ అధినేత, ప్రవాస భారతీయులు నల్లూరి వెంకట శేషయ్య నేడు ప్రారంభించనున్నారు. నల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా కారుమంచి కాలువ పూడికతీత, జంగిల్ క్లియరెన్స్, షట్టర్ల బిగింపు కార్యక్రమం జరుగుతున్న సంగతి తెలిసిందే. సంతనూతలపాడు మండలం వరకు కాలువ పూడికతీత పనులు జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తయ్యాయి. గత ఐదేళ్లుగా ఎలాంటి మరమ్మతులు నోచుకోని కాలువకు పూర్తి స్థాయిలో మరమ్మతులు జరిగాయి. తూములకు నూతన షట్టర్లను బిగించారు. దీంతో కాలువ పరిధిలో నీటి పారుదులకు ఆటంకాలు తొలగాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కారుమంచి కాలువ తూము షట్టర్‌లను ఎత్తి నీటిని విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, సాగర్ అధికారులు పాల్గొననున్నారు.

నేటి నుంచి గురుకుల పాఠశాలల సైన్సు ఫెయిర్

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి స్వామి



పనులు పరిశీలిస్తున్న మంత్రి స్వామి

ప్రజాశక్తి-కొండపి

కొండపి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 28, 29వ తేదీలలో 5 జిల్లాల్లో ఉండే గురుకుల పాఠశాలల విద్యార్థినులకు సైన్సు ఫెయిర్ నిర్వహించడం జరుగుతుందని కొండపి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. ఈ సందర్భంగా సైన్సు ఫెయిర్‌కు వచ్చే 5వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు ప్రకాశం, గుంటూరు, పల్నాడు, నెల్లూరు, బాపట్ల జిల్లాలోని గురుకుల పాఠశాల విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గురుకుల పాఠశాలలో ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఆదివారం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరుగుతున్న మరమ్మతులను మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే సైన్సుఫెయిర్ కార్యక్రమానికి వచ్చే విద్యార్థినులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పూర్తి స్థాయిలో మరమ్మతులు అన్నీ త్వరగా పూర్తి అయ్యేలా చూసుకోవాలని అన్నారు. విద్యార్థినులకు బాత్‌రూంలు, మంచినీటి సదుపాయం, ఆహారం వంటి తదితర వాటిపై ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-పొన్నలూరు

టపాసుల విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పొన్నలూరు ఎస్ఐ అనుక్ తెలిపారు. అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్సులు పొందిన నిర్వాహకులు వారికి కేటాయించిన మైదాన ప్రదేశాలలో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాపుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నాగులుప్పలపాడు: దీపావళి సందర్భంగా టపాసులు విక్రయదారులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ బి.శ్రీకాంత్ తెలిపారు. అనుమతులు తీసుకున్న తర్వాత అధికారులు సూచించిన ప్రదేశంలోనే నిబంధనలు పాటించి విక్రయాలు జరపాలన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా విక్రయాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి నర్శింహులు

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు కొనసాగించాలని సిఐటియు గిద్దలూరు మండల ప్రధాన కార్యదర్శి బి.నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గిద్దలూరు యూటిఎఫ్ కార్యాలయంలో కె.నారాయణ అధ్యక్షతన జరిగిన గిద్దలూరు భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే ఉచిత ఇసుకను అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇసుక అందుబాటులో లేకపోవడంతో గిద్దలూరు ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇసుక ప్రైవేటు ఏజెన్సీలకు అప్పచెప్పకుండా ప్రభుత్వమే ఉచితంగా అందుబాటులో ఉంచాలన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను కొనసాగించాలని కొత్త కార్డులు, పాత కార్డులు రెన్యువల్ చేయాలని, ప్రమాద బీమా పథకం అమలు పరచాలన్నారు. గిద్దలూరు మండల భవన నిర్మాణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కె.నారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎస్కే మహమ్మద్ గౌస్, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా డి.శ్రీనివాసులు, సిహెచ్ రాంబాబు, మద్దులేటి, కమిటీ సభ్యులుగా బి.నర్సింహులు, టి.ఆవులయ్య, ఎస్కే మహమ్మద్ భాష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వం ట్రూ అప్ ఛార్జీల పేరుతో పెంచిన కరెంటు చార్జీలు రూ.6072 కోట్లు రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర నాయకులు ఎవి నాగేశ్వరావు, రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి డిమాండ్ చేశారు. కరెంటు చార్జీల పెంపుకు నిరసనగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజానీకానికి మూడు నెలలకే రాష్ట్ర ప్రభుత్వం మోత మోగించిందని అన్నారు. అధికారంలోకొస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ ప్రకటించిన టిడిపి కూటమి ఇప్పుడు రూ.6072 కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందని అన్నారు. టిడిపి కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో హామీని తుంగలోతొక్కి 44శాతం పెంచడం దారుణం అన్నారు. మాట తప్పి ప్రజలపై వేసిన చార్జీలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, చీరాల పట్టణ కార్యదర్శి ఎం వసంతరావు, నాయకులు ఎం సత్యమూర్తి, యేసురత్నం, చింత శ్రీనివాసరావు, టాక్సీ డ్రైవర్ సీనియర్ నాయకులు కె జైకుమార్, సిరిపురం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


వాడరేవులోని ఆశ్రమం వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - చీరాల

వాడరేవు శ్రీశ్రీశ్రీ రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో షుగరు ఉచిత వైద్య శిభిరం ఆదివారం నిర్వహించారు. వైద్య శిభిరంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 1193 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. నెలకు సరిపడు మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిభిరానికి హాజరైన వారందరికి అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేశారు. కేవలం మందులపై ఆధార పడవద్దని వైద్యులు చెప్పారు. జీవన విధానం, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే షుగర్ నియంత్రణలో ఉంటుందని సూచించారు. మానసిక ఆందోళన తగ్గించుకోవాలని చెప్పారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం అలవాటు చేసుకోవాలని చెప్పారు. క్యాంపులో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, సాయి ఫణికిషోర్, చందన, కామేశ్వరరావు, ఎంజి శంకరరావు, బసవరావు, కుమార్, ఎ సురేష్, మిత్ర ల్యాబ్ వలి, గోపాల్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు.

నేడు ఆనందబాబు పర్యటన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మాజీ మంత్రి, శాసన సభ్యులు నక్క ఆనందబాబు నియోజకవర్గంలో నేడు పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధి తెలిపారు. చుండూరు మండలం యడ్లపల్లి గ్రామంలో 68వ స్టేట్ లెవెల్ అండర్ -17 బాల, బాలికల చెస్ టోర్నమెంట్ ప్రారంభిస్తారని తెలిపారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరులో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని లోకల్ ఫండ్ సత్రం భవన నిర్మాణంకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కావున నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

పీడిత వర్గాల నేత కామ్రేడ్ ఏచూరి

ఏచూరి సంస్మరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి - అద్దంకి

సామ్రాజ్యవాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా పీడిత వర్గాల కోసం తుది శ్వాస వరకు పోరాడిన నేత కామ్రేడ్ సీతారాం ఏచూరి అని వక్తలు కొనియాడారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ సభ తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ భారత రాజకీయాల్లో ఏచూరి జీవితం విశిష్టమైనదని, ఉత్తేజ కరమైనదని కొనియాడారు. జెఎన్‌యు విద్యార్థి ఉద్యమ నేతగా నాటి ప్రధాని ఇందిరా గాంధీని వైస్ ఛాన్సలర్‌గా రాజీనామా చేయమని డిమాండ్‌తో ఆయన ఉద్యమ ప్రస్థానం ప్రారంభమై మార్కిస్టు పార్టీ అత్యున్నత బాధ్యతైన జాతీయ కార్యదర్శిగా ఉద్యమ ప్రయాణాన్ని సాగించారని అన్నారు. ఆయన అనారోగ్య పరిస్థితుల్లో మృతి చెందటం భారత రాజకీయాలకే తీరని లోటని అన్నారు. ఎంతటి క్లిష్టమైన విషయాన్నైనా సున్నితంగా వివరించి మెప్పించి కమ్యూనిస్టు ఆలోచనని ఇతరులకు పంచటంలో ఆయన శైలి ప్రత్యేకమైన దంటూ వివరించారు. అంతర్జాతీయ రాజకీయాల్లో వస్తున్న మార్పులను భారతదేశంలో ప్రభావం, ఇతర పరిస్థితులను ఆయన విశ్లేషించారు. వామపక్ష నాయకులు అన్నంనేనివెంకట్రావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీల్లో నాయకత్వ స్థాయికి రావటం అంత సులువైన విషయం కాదని, 40ఏళ్ల సుదీర్ఘ పోరాటం జాతీయ, అంతర్జాతీయ రాజకీయాల్లో ఆయన పాల్గొన్న తీరు, తదితర అంశాల ద్వారానే ఆయన జాతీయ కార్యదర్శిగా ఎదిగారని అన్నారు. ఇతర రాజకీయ పార్టీల్లో డబ్బు, కులం, హింస వాదం వంటి లక్షణాలతో నాయకులుగా ఎదుగుతారని, కమ్యూనిస్టు పార్టీల్లో అది సాధ్యం కాదని అన్నారు. అత్యంత సంక్లిష్ట పరిస్థితులు ఉన్న ఈ దశలో మరో దశాబ్ద కాలం పాటు ఉద్యమానికి నాయకత్వం వహించగల శక్తిసామర్థ్యాలు ఉన్న ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీలకే కాక భారత రాజకీయాలకు తీరని లోటని అన్నారు. విద్యార్థిగా అగ్రస్థానంతో ప్రారంభమైన ఆయన జీవితం ప్రతి రంగంలోనూ అగ్రస్థానంలోనే నిలిచారని, చివరికి తుది శ్వాస కూడా అగ్రనేతగానే ముగించారని విశ్లేషించారు. జెఎన్‌యులో వరుసగా మూడు సార్లు విద్యార్థినేతగా ఎన్నికైన ఘనత కామ్రేడ్ ఏచూరికే దక్కుతుందని అన్నారు. విభిన్న భాషలను అనర్గళంగా మాట్లాడగలిగే శక్తి సామర్థ్యాలు, పెద్దల సభలో ఆయన విశ్లేషణలకు అగ్రస్థానం నిలిచిందని అన్నారు. సామ్రాజ్యవాద విస్తరణలో అంతర్జాతీయంగా నేడు సాగుతున్న యుద్ధాలు కొన్ని దేశాలను నామరూపాలు లేకుండా చేసేవిగా ఉన్నాయని, అలాగే భారతదేశంలో ఆదిపత్య భావజాలం ఇతర భావజాలను అణిచిపెట్టెందుకు ప్రయత్నం చేస్తుందని అన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు, లౌకిక తత్వాన్ని కాపాడేందుకు కమ్యూనిస్టు మేధావులు, సంఘాలు, విశాల ఐక్యత ఉద్యమాలు నిర్వహించడమే ఏచూరికి ఇచ్చే నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో కావూరి రఘుచందు, త్రిమూర్తులు, బాబురావు, చెన్నుపాటి రామాంజనేయులు మాట్లాడారు.



సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి

జన విజ్ఞానం వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు


చెకుముకి విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - వేటపాలెం

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు అన్నారు. బాపట్ల జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు మండలంలోని దేశాయిపేట జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 20 ప్రభుత్వ పాఠశాలలు, 15 ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల హెచ్‌ఎం దేవరకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు నిత్య జీవితంలో సైన్స్ నేర్చుకుని వాస్తవిక దృక్పథాన్ని కలిగి ఉండాలని అన్నారు. కుర్ర రామారావు మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలోని అనేక మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని అన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు యాజలి భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుటకై గత 36ఏళ్లుగా చెకుముకి పేరుతో సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి తంగ శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్షరాస్యత ఉద్యమంలో, మధ్య నిషేధ ఉద్యమంలో జెవివి ప్రధాన పాత్ర పోషించిందని తెలిపారు. ప్రాథమిక పరీక్షా ఫలితాల అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఎంపిక చేయబడిన పాఠశాలల్లో టై ఏర్పడినది. టై పరీక్ష అనంతరం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుండి జిల్లా వ్యాప్తంగా ఎన్నికైన పాఠశాలల వివరాలు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో బల్లికురవ మండలం కొప్పెరపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల, చీరాల మండలం ఈపూరుపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల, సంతమాగులూరు మండలం మక్కినవారిపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని ప్రకటించారు. ప్రైవేటు పాఠశాల విభాగంలో చెరుకుపల్లి మండలం గూడవల్లి వనజ చంద్ర హై స్కూల్, చిన్నగంజాం సత్యం హై స్కూల్, నిజాంపట్నం అల్లుమర హైస్కూల్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాలలు నవంబర్ 9, 10 తేదీల్లో విశాఖపట్నంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి సంబరాలకు హాజరవుతాయని జిల్లా ప్రధాన కార్యదర్శి తంగా శ్రీనివాసరావు తెలిపారు. చిన్నగంజాంకు చెందిన ఎం సూర్యనారాయణ, బండారు నాగేశ్వరరావు విద్యార్థులకు మొమెంటులు అందించుటకై ఆర్థిక సహకారాన్ని అందించారు. డాక్టర్ జి సుబ్బారావు, గ్రామ పెద్దలు విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించారు. కర్ణ శ్రీనివాస్, హేమంత్ పోటీల నిర్వహణకు సహకరించారు. జెవివి సాంస్కృతిక కన్వీనర్ యు దక్షిణామూర్తి ఆలపించిన జాగృతి గీతాలు అలరించాయి. కార్యక్రమంలో డి హరిబాబు, పి రంగారావు, బిక్షాలు బాబు, కె శ్రీనివాసరావు, వీర ప్రసాదు, జి సూరిబాబు, కుర్రా శ్రీనివాసరావు, హేమంత్ కుమార్, పాలేటి సురేష్, వెలుగొండారెడ్డి, కుమార్, జయరాజు, నూతలపాటి కోటేశ్వరరావు, రమేష్ బాబు, కర్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరుకుపల్లి : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల పోటీల్లో జిల్లాస్థాయి విజేతగా మండలంలోని గూడవల్లి వనజా చంద్ర పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. వేటపాలెం మండలం దేశాయిపేట జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముఖి సంబరాల పోటీల్లో ప్రైవేట్ స్కూల్ విభాగంలో వనజా చంద్ర పబ్లిక్ స్కూల్ విద్యార్థులు గెలుపొందారు. వీరు నవంబర్లో విశాఖపట్నంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాల పోటీల్లో బాపట్ల జిల్లా నుండి ప్రాతినిధ్య వహిస్తారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను జన విజ్ఞాన వేదిక చెరుకుపల్లి మండల గౌరవ అధ్యక్షులు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని, జెవివి మండల గౌరవ అధ్యక్షులు ఇంకొల్లు రంగారావు, ప్రధాన కార్యదర్శి కుంచా వెంకట రామ మోహనరావు, కాటూరి నాగేశ్వరరావు, పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు విద్యార్థులు, ప్రత్యేకంగా అభినందించారు.


బహుమతులు అందజేస్తున్న జెవివి నాయకులు


జెండా ఊపి రన్ ప్రారంభించిన సిఐ మల్లికార్జునరావు

మౌంట్ ఫోర్ట్ పాఠశాల రజతోత్సవం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని మౌంట్ ఫోర్ట్ పాఠశాల 25ఏళ్ల రజతోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులకు, పూర్వ విద్యర్థులకు 4కె రన్‌ను సిఐ మల్లికార్జునరావు రిబ్బన్ కత్తిరించి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25ఏళ్లుగా మౌంట్ ఫోర్ట్ పాఠశాల విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ ఎంతోమందిని ప్రయోజకులను చేసిందని అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పట్టుదల ఉత్సాహం, స్పోర్ట్స్ స్పిరిట్, పట్టుదలతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని అన్నారు. 4కె రన్‌లో గెలుపొందిన వారికి విశిష్ట అతిథి పిరాట్లంక జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్ చేత ఆకర్షణీయమైన బహుమతులు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు, పూర్వ విద్యార్థులకు, పోలీసులకు, మీడియా మిత్రులకు, సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ బ్రదర్ ప్రదీప్‌రెడ్డి, కమతం శివ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి లేదు

- మాజీ మంత్రి బాలినేనిపై అనుచిత వ్యాఖ్యలు సహించం
- శశికాంత్ భూషణ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలి
- జనసేన పార్టీ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ జడ బాలనాగేంద్ర యాదవ్



మాట్లాడుతున్న జడ బాలనాగేంద్ర యాదవ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్‌ను విమర్శించే స్థాయి ఎద్దు శశికాంత్ భూషణ్‌కు లేదని జనసేన పార్టీ ప్రచార కమిటీ జిల్లా కోఆర్డినేటర్ జడ బాలనాగేంద్ర యాదవ్ తెలిపారు. స్థానిక డొక్కా సీతమ్మ అన్నదాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బాల నాగేంద్ర యాదవ్ మాట్లాడారు. టిడిపి జిల్లా నాయకుడు ఎద్దు శశికాంత్ భూషణ్ ఉప ముఖ్యమంత్రి పవనన్ కళ్యాణ్, మాజీ మంత్రి బాలినేని, ఆయన కుమారుడు ప్రణీత్ రెడ్డి, డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమ నిర్వహణపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. జనసేన పార్టీలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డిని చేర్చుకునే సమయంలో టిడిపి నాయకులు చెప్పాల్సిన ఇంగిత జ్ఞానం లేదా అంటూ ఎద్దు శశికాంత్ భూషణ్ మాట్లాడటం దుర్మార్గమన్నారు. టిడిపిలో ఒంగోలు మేయర్, కార్పొరేటర్లను చేర్చుకునే సమయంలో జనసేన నేతలకు ఎందుకు చెప్పలేదని ఎమ్మెల్యే దామచర్లను ఎద్దు శశికాంత్ భూషణ్ ప్రశ్నించారా అని సూటిగా అడిగారు. రాష్ట్రంలో సైకో జగన్ పరిపాలన పోవాలని ఎన్‌డిఎ కూటమి ఎన్నికలలో ప్రజలను చైతన్యపరచి అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైతం సంకీర్ణ ప్రభుత్వంలోని ఎవరిని విమర్శించ వద్దని సూచించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైసిపి నేతలను పార్టీలో చేర్చుకునే సమయంలో జనసేన పార్టీ నేతలు ఎవరూ ఆక్షేపణ చేయలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కలిసి పనిచేస్తున్నారని, ఆయా పార్టీలకు సంబంధించి చేరికలు అంతర్గత అంశమని తెలియజేశారు. కూటమిలో భాగంగా ఒంగోలు ఎమ్మెల్యే స్థానం దామచర్లకు దక్కిందని, ఆయన గెలుపు కోసం టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పనిచేయటంలో అఖండ మెజార్టీ వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఎద్దు శశికాంత్ భూషణ్‌కు కూటమి పొత్తు ధర్మం తెలుసా అని, సభా వేదికపై పనిచేయని అధికారులను కొట్టాలని చెప్పటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు శశికాంత్ భూషణ్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని, లేకపోతే జనసేన పార్టీ నేతలు తగిన బుద్ధి చెబుతారన్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి,ఆయన కుమారుడు ప్రణీత్ రెడ్డి, తనపై శశికాంత్ భూషణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. బాలినేనిపై చేసిన అవినీతి అరోపణలపై విచారణ ఏమైనా జరిగిందా అని ప్రశ్నించారు. బాలినేనిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమంపై శశికాంత్ భూషణ్ వ్యాఖ్యలు చేశారని, పేదల ఆకలిని తీర్చేందుకు గత 102 రోజులుగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఇప్పటి వరకు 12 మంది దాతలు సహకరించారన్నారు. ఒంగోలు నగరంలో అన్నా క్యాంటీన్ల నిర్వహణకు ఎమ్మెల్యే దామచర్ల విరాళాలు సేకరించారని, వాటిపై తాము ఎప్పుడు ఆక్షేపణ చేయలేదన్నారు. ఇప్పటికైనా పొత్తు ధర్మం పాటిస్తూ టిడిపి-జనసేన ఒకరికొకరు సహకరించుకోవాలని, విమర్శలు చేయటం సరికాదన్నారు. ఈ సమావేశంలో పార్శ కోటయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బేషరతుగా వ్యాఖ్యలు ఉపసంహరించుకుంటున్నా

- ఎద్దు శశికాంత్ భూషణ్
- బాలినేని ఎక్కడున్నా తమకు శత్రువే
- పొత్తు ధర్మం పాటిస్తూ ముందుకెళదాం



మాట్లాడుతున్న ఎద్దు శశికాంత్ భూషణ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

టిడిపి విస్తృత స్థాయి సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై తాను చేసిన వ్యాఖ్యలు అనుచితమని జనసేన పార్టీ నేతలు భావిస్తే బేషరతుగా ఆ వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకుంటున్నట్లు టిడిపి జిల్లా నాయకులు ఎద్దు శశికాంత్ భూషణ్ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డిని చేర్చుకునే ప్రక్రియపై మాత్రమే తాను వ్యాఖ్యలు చేశానని, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పేరు ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. జనసేన పార్టీ నేతలకు ఈ వ్యాఖ్యలు ఇబ్బంది కలిగిస్తే బేషజాలకు పోకుండా ఉపసంహరించుకుంటానన్నారు. జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఈ విషయమై తనను హెచ్చరించారన్నారు. షేక్ రియాజ్‌కు తన విషయాలు అన్ని తెలుసన్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఏ పార్టీలో ఉన్నా తెలుగుదేశం పార్టీకి శత్రువేనని ఆయన పునరుద్ఘాటించారు. వైసిపి ప్రభుత్వంలో బాలినేని శ్రీనివాస రెడ్డి, ఆయన కుమారుడు చేసిన అన్యాయాలు, అక్రమాలు టిడిపి నేతలు మరచిపోరన్నారు. 2024 ఎన్నికలలో టిడిపి నేత మేడికొండ మోహనరావుపై బాలినేని అనుచరులు దాడి చేశారని, ఎమ్మెల్యే దామచర్లతో పాటు తాము ఆయనను చికిత్స కోసం రిమ్స్‌కు తీసుకెళితే అక్కడ పార్టీ నేతలపై వైసిపి దాడులకు తెగబడ్డారన్నారు. ప్రశ్నించిన పోలీసులపై కూడా బాలినేని శ్రీనివాస రెడ్డి దౌర్జన్యం చేశారన్నారు. దాడి చేసిన వారిని వదిలి బాధితులపై కేసులు పెట్టారన్నారు. అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి మహిళా నాయకురాలు ఆర్ల వెంకటరత్నంపై వైసిపి నేతలు దాడి చేశారని, అడ్డుకున్న తమను కొట్టారన్నారు. చివరకు పోలీసులు దాడి చేసిన వారిని వదిలి బాధితులపై కేసులు పెట్టిన విషయాన్ని ఎవరూ మరచిలేపోలేదన్నారు. బాలినేని శ్రీనివాస రెడ్డి ఏ పార్టీలో ఉన్నా తమకు శత్రువేనని, ఆయన చేసిన అరాచకాలను గుర్తు పెట్టుకుంటామన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో జనసేన పార్టీలో కంది రవిశంకర్, సామినేని ఉదయభాను తదితర నేతలను చేర్చుకుంటే టిడిపి నేతలు ఎక్కడా విమర్శించలేదన్నారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి చేరికను మాత్రమే తాము వ్యతిరేకించారన్నారు. పొత్తు ధర్మం, మిత్రధర్మం పాటిస్తే ఇరు పార్టీలకు మంచిదని, భవిష్యత్తులో ఆవిధంగా ముందుకెళదామని ఆయన కోరారు. ఈ సమావేశంలో తెలుగు యువత అధ్యక్షుడు ముత్తన శ్రీనివాసలు, బోడపాటి వెంకట్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా పార్కు

రూ. 10 లక్షల నిధులు మట్టిపాలు



గేట్లు తెరవని పార్కు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో గత టిడిపి ప్రభుత్వ హయాంలో రూ. 10 లక్షల ఉపాధి నిధులతో పార్కును ఏర్పాటు చేశారు. అందులో అన్ని రకాల మొక్కలు నాటి కొంతకాలం పాటు పర్యవేక్షించారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడం, వైసిపి అధికారంలోకి రావడంతో పార్కుపై సవతి తల్లి ప్రేమను చూపారు. రూ. 10 లక్షల ఉపాధి నిధులతో ఏర్పాటు చేసిన మొక్కలు మట్టిపాలయ్యాయి. పార్కు ఆలనా..పాలనా ఆగింది. కనీసం గేటు తెరిచే నాథుడే కరువయ్యారు. మొక్కలకు నీరు పోసేవారు కనుమరుగయ్యారు. దీంతో మొక్కలు ఎండిపోయి. పార్కు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది.

దైనందిన జీవితంలో..

ప్రస్తుతం దైనందిన ఒత్తిడి మయ జీవితంలో మనిషికి కాస్త ఆహ్లాదం అవసరం. ఖాళీ సమయాలు, వారాంతాల్లో కుటుంబంతో కలిసి సరదాగా గడపాలనుకుంటారు. దూర ప్రాంతాలకు వెళ్లలేకపోయినా దగ్గరలో పార్కులు, ఇతర ప్రదేశాల్లో సేదతీరుతారు. నియోజకవర్గ కేంద్రమైన యర్రగొండపాలెం పట్టణంలో అందుకు అనువైన స్థలంగా ఎంపిడివో కార్యాలయ ఆవరణలోని స్థలాన్ని గుర్తించారు. రూ. 10 లక్షల ఉపాధి నిధులతో రకరకాల మొక్కలు పెంచారు. ప్రతిరోజూ యువతులు, వ్యాధిగ్రస్తులు 100 నుంచి 150 మంది వరకూ ఆ ఉద్యాన వనంలో సేద తీరేవారు. గత వైసిపి ప్రభుత్వం దాని గురించి పట్టించుకోకపోవడంతో పార్కు అధ్వానంగా తయారైంది. కూటమి ప్రభుత్వంలోనైనా అవసరమైన నిధులు కేటాయించి పార్కును ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని కోరుతున్నారు.



సత్య ఎక్స్‌పోర్ట్స్ అధినేత సుధాకర్ మనుమరాలు ఓణీల వేడుకలు ఒంగోలులోని విష్ణుప్రియ కన్వెన్షన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి శిద్దారాఘవరావు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

ప్రజాశక్తి- ఒంగోలు



రాష్ట్రస్థాయి పోటీలకుఎంపికైన చంద్ర సిద్దార్థ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మోర్య చంద్రసిద్దార్థ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీలకకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, పీడీలు పి. రామా నాయక్, హెచ్. రామా నాయక్ తెలిపారు. నవంబర్ 3, 4 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో మోర్య చంద్రసిద్దార్థ ప్రాతినిధ్యం వహించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చంద్ర సిద్దార్ధను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, స్టాఫ్ సెక్రటరీ వి. నాగమూర్తి, సీనియర్ ఉపాధ్యాయులు విజయ మాణిక్యం, అనసూయ దేవి, కిరణ్ కుమార్, పోలయ్య, మీటే నాయక్, వెంకట శివ కుమారి, చంద్రమౌళి, శిరీషా రాణి, ఆంజనేయులు, ఆవులయ్య, లక్ష్మీనారాయణ తదితరులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని వారు ఆకాక్షించారు.



క్షేత్ర స్థాయి పర్యటనలో విద్యార్థినులు

క్షేత్ర స్థాయి సందర్శనలో... ఎపి మోడల్ స్కూల్ విద్యార్థినులు

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలను మార్కాపురం మండలం మిట్టమీదపల్లిలోని ఎపి మోడల్ స్కూల్ విద్యార్థినులు ఆదివారం సందర్శించారు. వత్తివిద్య కోర్సు అభ్యసించే 200 మంది విద్యార్థినులు , పాఠశాల ప్రధానా చార్యులు వేణుగోపాల్, ఉపాధ్యాయులు షేక్ గౌస్ మొహెుద్దీన్, బిజమోహన్, వత్తి విద్యా ఉపాధ్యాయులు ఉస్మాన్ బాషా ఈ సందర్శనలో పాల్గొన్నారు. కళాశాలలోని అన్ని ప్రయోగశాలలను, వాటి యొక్క విశిష్టత గురించి అక్కడి అధ్యాపకులు సవివరంగా వివరించారు. ఇలాంటి సందర్శనలతో విద్యార్థులలో ఆలోచనలు పెంపొందించడం, టెక్నాలజీని ఎలా వినియోగించు కోవాలో అర్థం చేసుకోగలరని, అందుకే ఇలాంటి పర్యటనలు చేపట్టామని ప్రధానాచార్యులు వేణుగోపాల్ తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటాంటి సందర్శనలు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ ఇంటింటి సందర్శనలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని ఆయన కోరారు.

అధికారుల నిర్లక్ష్యంతో మునిగిన విఠలేశ్వర నగర్



విటలేశ్వర నగర్ కాలనీలో నిలిచిన నీరు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పంచాయితీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వర్షాలు లేకపోయినా విటలేశ్వర్ నగర్ కాలనీ మరోసారి ముంపుకు గురైంది. 15రోజులు క్రితం వర్షాలు తగ్గడంతో అధికారులు కాలనీ సమీపంలోని వెల్లటూరు ఛానల్‌కు సాగునీరు పూర్తిగా తగ్గించడంతో కాలనీలో నుండి వర్షపు నీరు కాలువలోకి జారిపోయి బయటపడింది. దీంతో కాలనీవాసులు గృహాలు చుట్టూ నిలబడిన వర్షపు నీటి నుండి ఉపశమనం పొందారు. కాలనీలో నిలబడిన నీరును కాలువలోకి మళ్లించేందుకు ఉన్న తూమును నీరు తగ్గిన వెంటనే సాగునీరు విడుదల చేయకముందే మూసివేస్తే మరోసారి ఈ దుస్థితి ఏర్పడేది కాదు. ఎప్పుడు ఇరిగేషన్ అధికారులు సాగునీటిని విడుదల చేస్తారో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆ తూమును మూసివేసి కాలనీలోకి నీరు రాకుండా చూడాలని అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోకపోవడంతో సాగునీరు విడుదల కాగానే మరోసారి తూము ద్వారా నీరు కాలనీలోకి ప్రవేసించి పూర్తిగా నీట మునిగే పరిస్థితి దాపరించిందని కాలనీవాసులు వాపోతున్నారు. ఎలాగూ వర్షాలు కురిసే సమయంలో మోకాటి లోతు నీటిలో తిరగక తప్పడం లేదని, వర్షాలు లేని సమయంలో కూడా అధికారుల నిర్లక్ష్యంతో రహదారులు మునిగిపోయి గృహాలను నీరు చుట్టు ముట్టడం ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 19న కాలనీలో ప్రధాన రహదారి నిర్మాణానికి శాసన సభ్యులు నక్క ఆనందబాబు రూ.60లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. జనవరి నాటికి రహదారులు పూర్తి చేయాలని భావిస్తున్న అధికారులకు పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సాగునీరు తగ్గించేవరకు కాలనీలో రహదారులు నీట మునిగే ఉంటాయని, దీనివలన రహదారి నిర్మాణ పనులు ఏ విధంగా చేపడుతారని ప్రశ్నిస్తున్నారు. వెల్లటూరు చానలకు సాగునీటిని నవంబర్ చివరి వరకు లేదా డిసెంబరు మొదటి వారం వరకు కొనసాగించే పరిస్థితులు ఉన్నాయి. అధికారులు ఈ కాలనీకి ఉన్న తూముపై చర్యలు చేపట్టకపోతే రహదారి పనులు ఆలస్యం అయ్యే ప్రమాదం లేకపోలేదు. ఇదిలా ఉండగా గ్రామంలో పలుచోట్ల లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు బయటకు తోడెందుకు పంచాయతీ అధికారులు రెండు ఆయిల్ ఇంజన్లు కొనుగోలు చేసి సిద్ధం చేశారు. వీటిని ఉపయోగించి భట్టిపోలు 7, 8వార్డుల్లో యుద్ధ ప్రాతిపదికన బయటకు తోడించాలని ఆ ప్రాంతవాసులు కోరుచున్నారు.



పంచాయతీ కార్యాలయంలో సిద్ధం చేసిన ఆయిల్ ఇంజన్లు



కొసరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

సినీ సాహిత్యాన్ని జానపదాలతో జన రంజకం చేసిన కొసరాజు

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగు సినీ సాహిత్యాన్ని జాన పదాలతో జన రంజకం చేసిన కవి కొసరాజు రాఘవయ్య చౌదరని సాహితీ భారతీ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అన్నారు. కొసరాజు 37వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఆదివారం నివాళులు అర్పించారు. కర్లపాలెం మండలం లోని చింతయపాలెంలో జన్మించిన కొసరాజు బాపట్ల మండలం అప్పికట్లలో ప్రాథమిక, ఉన్నత విద్య పూర్తి చేశారని అన్నారు. 2వందల సినిమాలకు వేయ్యికి పైచిలుకు పాటలు రచించారని అన్నారు. సాహితి భారతి కార్యదర్శి మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ కొసరాజు కవిరత్న, జానపద కవి సార్వభౌమ, రఘుపతి వెంకటరత్నం నాయుడు వంటి బిరుదులు అందుకున్నారని అన్నారు. తమ సాహిత్యం ద్వారా సందేశాత్మక పాటలతోపాటు సమాజంలోని దురలవాట్ల బారినపడి యువతను మేల్కొల్పేందుకు హాస్య భరితంగా వ్యంగ్యాత్మకంగా సున్నితంగా తమ సాహిత్యం ద్వారా విమర్శించారని తెలిపారు. కార్యక్రమంలో ఆదం షఫీ, ప్రజా కవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీనివాస్, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్ర మూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు, కె కాళిదాసు పాల్గొన్నారు.



చిన్నారిని ఆశీర్వదిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ఓణీల వేడుకల్లో డాక్టర్ లక్ష్మి

ప్రజాశక్తి - ముండ్లమూరు

మండలంలోని పూరిమెట్ల గ్రామంలో టిడిపి నాయకులు నిండిగంటి నారాయణ, కమలమ్మ దంపతుల కుమార్తె నిహారిక ఓణీల బహుకరణ వేడుకకు హాజరై తెలుగుదేశం ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ చిన్నారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కూరపాటి శ్రీను, ముండ్లమూరు, పూరిమెట్ల టిడిపి నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సూర్యలంక బీచ్‌లో యువకుడు మృతి

ప్రజాశక్తి - బాపట్ల



రెషికళ్యాణ్ (ఫైల్)

స్నేహితులతో కలిసి సరదాగా గడుపుదామని సూర్యలంక బీచ్‌కు గుంటూరు పట్టణం కొత్తపేటకు చెందిన యువకులు ఆదివారం వచ్చారు. సరదాగా సముద్రంలో ఈతకు దిగారు. వీరిలో రెషి కళ్యాణ్ (20) అనే యువకుడు గల్లంతై మృతి చెందిన సంఘటన సూర్య లంక బీచ్‌లో చోటుచేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు కొత్తపేటకు చెందిన 9మంది యువకులు సూర్యలంక బీచ్‌కు వచ్చారు. సముద్ర స్నానాలు చేస్తుండగా వారిలో ఇద్దరు అలల తాకిడికి కొట్టుకుపోతుండగా గజ ఈతగాళ్లు ఒకరిని ఒడ్డుకు చేర్చి రక్షించారు. అలల తాకిడికి గల్లంతైన రెషి కళ్యాణ్ కొద్దిసేపటికి శవమై ఒడ్డుకు కొట్టుకొచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

జీవో 117 రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - సంతమాగులూరు

జిఒ 117ను వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన యుటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ విధానాల వలన విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. జిఒ 117 వలన రాష్ట్రంలో కొన్ని ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యాయని అన్నారు. ప్రాథమిక తరగతులు ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం వలన రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. నాడు, నేడు పథకంలో భాగంగా పాఠశాలలకు పెట్టిన ఖర్చుకు ఉపయోగం లేకుండా పోయిందని అన్నారు. నాడు నేడు పేజ్–2లో పనులు పూర్తి కాకుండా నడుస్తున్నాయని అన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, జీవన భద్రత అన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన పాలక ప్రభుత్వం హామీని విస్మరించి సిపిఎస్ బదులుగా జిపిఎస్ పేరుతో వంచనకు తెరలేపిందని అన్నారు. అనంతరం యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యుటిఎఫ్ అధ్యక్షులుగా యలగాల పోతురాజు, ప్రధాన కార్యదర్శిగా మక్కెన నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె కరీముల్లా, గౌరవ అధ్యక్షులుగా పరిమి కోటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్ ముత్తారావు, మరో 10 మంది సభ్యులు, జిల్లా కౌన్సిలర్ సభ్యులుగా ఏడుగురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, నాయకులు పి వలీ ఖాన్, పుల్లారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పోతురాజు



నాగేశ్వరరావు

యువత ఆలోచన విధానాన్ని మార్చటమే ధ్యేయం

ప్రజాశక్తి - మేదరమెట్ల

ప్రస్తుత కాలంలో యువత అనేక సమస్యలతో తప్పు దారి పడుతూ ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను దుఃఖ సాగరంలోకి నేడుతున్నారు. అలా కాకుండా యువత ఆలోచనల్లో దృఢత్వం, ధైర్యం నింపటం కోసమే స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వారా మేదరమెట్లలో రీజనల్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ ఈదా సామ్యూల్‌రెడ్డి తెలిపారు. తన కుటుంబంలో జరిగిన నష్టం మరే కుటుంబంలో జరగకూడదనే ఉద్దేశంతో సంస్థను స్థాపించినట్లు తెలిపారు. స్థానిక ధృతి డెవలపర్స్ వెంచర్లో ఫౌండేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ సంస్థ ఐదేళ్ల క్రితమే ప్రారంభించామని తెలిపారు. ప్రారంభించినప్పుడు ఐదుగురు సభ్యులతో మొదలై ప్రస్తుతం 3వేల మందికిపైగా సభ్యులు వాలంటరీగా పని చేస్తున్నారని అన్నారు. ఫౌండేషన్ ద్వారా 1200మంది యువకులను కాపాడినట్లు తెలిపారు. చెడు అలవాట్లకు బానిసలై, ప్రేమలో పడి విజయం సాధించలేక, తప్పుడు ఆలోచనలతో మధ్యలోనే ప్రాణాలు తీసుకుంటున్నారని అన్నారు. అటువంటి వారికి ధైర్యాన్ని నింపి, ఒత్తిడిని తట్టుకోవటానికి వారి ఆలోచన విధానంలో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగు రాష్ట్రాలకు విస్తరించిన తమ సంస్థ మేదరమెట్లలో కూడా రీజనల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకు కారకులైన ధృతి డెవలపర్స్ ఎండి పిఎల్ రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ధృతి ఎండి పియల్ రమేష్ బాబు మాట్లాడుతూ మేదరమెట్ల గ్రామానికి వ్యాపార దృక్పథంతోనే వచ్చామని తెలిపారు. ఆ తర్వాత గ్రామస్తులతో పెరిగిన పరిచయంతో గ్రామంలో ఒకడినై ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వంటి ఇంటర్నేషనల్ సంస్థలు ఇక్కడికి వచ్చి సమాజానికి చేసేసేవలో తాను భాగస్వామిని కావాలనుకున్నట్లు తెలిపారు. అందుకే ఈ వెంచర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు కానుకగా ఇవ్వాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇక్కడ సహకరిస్తున్న గ్రామ పెద్దలు, భూమిని ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. మేదరమెట్ల గ్రామ అభివృద్ధిలో తాను భాగస్వామిని కావడం తన అదృష్టం అన్నారు. కార్యక్రమానికి జిఎంఆర్ రియల్ ఎస్టేట్ నెల్లూరుకు చెందిన మురళి, మానవతా సేవా సంస్థ అధ్యక్షులు శ్రీనివాసరావు, సిహెచ్‌ఎస్ మూర్తి, లెక్చరర్ చంద్రికతోపాటు గ్రామ నాయకులు సింగమనేని శ్రీనివాసరావు, కోయి అంకారావు, జజ్జర ఆనందరావు, రేగుల ఆంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఇదా శామ్యూల్‌రెడ్డి



సంఘీభావం తెలుపుతున్న రెడ్డి సంఘాల నాయకులు

ఐక్యతతోనే భవిష్యత్తు

ప్రజాశక్తి - బాపట్ల

ఐక్యతతోనే బాపట్లలో రెడ్లకు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని అఖిల భారత రెడ్ల ఐక్య వేదిక కన్వీనర్ పట్నం సురేందరరెడ్డి అన్నారు. పట్టణంలోని ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన అఖిల భారత రెడ్ల ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో రెడ్లు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలంటే ఐకమత్యంతోనే సాధ్యమవుతుందని అన్నారు. బాపట్ల నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గం అభ్యర్థిని స్వతంత్ర అభ్యర్థిగానైనా గెలిపించుకోవాల్సిన బాధ్యత రెడ్లపై ఉందన్నారు. నియోజకవర్గంలో 40వేల పైచిలుకు రెడ్డి ఓటర్లు ఉన్నారని అన్నారు. ఐక్య వేదిక గౌరవ సలహాదారులు అన్నపురెడ్డి విజయభాస్కరరెడ్డి, ఐక్యవేదిక కో కన్వీనర్ దోరకచర్ల భరతరెడ్డి, ఐక్యవేదిక మహిళా నాయకురాలు సానం సుహాసినిరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త దోమ భార్గవ్‌రెడ్డి, గంపాల వెంకటరెడ్డి, నాగార్జునరెడ్డి, సమ్మెట శ్రీనివాసరెడ్డి, రెడ్డి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - వేమూరు

కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చే విషయంలో స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా నిబంధనలు కౌలు రైతులకు శాపంగా మారాయని కౌలు రైతులు సంఘం జిల్లా అధ్యక్షులు తోడేటి సురేష్ అన్నారు. 2019పంట సాగు హక్కు దారుల చట్టం ప్రకారం కౌలు రైతు గుర్తింపు కార్డులు పొంది పంట రుణాల కోసం బ్యాంకు వెళితే సంబంధిత కౌలు రైతుకు పంట రుణం ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ అనేకసార్లు బ్యాంకు చుట్టూ తిరిగిన ఖరీఫ్ సీజన్ ముగిస్తున్న పంట రుణాలు ఇవ్వకుండా కారణాలు చూపుతూ కుదరదని బ్యాంకు మేనేజర్ చెప్పటం కౌలు దారులను ఆందోళనకు గురిచేస్తుందని అన్నారు. కౌలు రైతులకు పంట రుణం ఇచ్చే విషయంలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ నిబంధనలకు విరుద్ధంగా ఎస్‌బిఐ నిబంధనలు ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా కౌలు రైతులకు పంట రుణాలు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్‌బిఐ మేనేజరు కౌలుదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు మునిపల్లి కోటేశ్వరావు, కౌలు రైతులు టి కిషోర్, కాకాని బాబు, పులిర్తిసురేష్ పాల్గొన్నారు.



పర్చూరు వంతెనపై ప్రమాదకరంగా ఇనుప ఊసలు

వంతెనపై బయటపడ్డ ఇనుప చువ్వలు

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరు, గుంటూరు ఆర్అండ్బి రోడ్డులో 2017లో వంతెన నిర్మించారు. ఈ రహదారిలో చప్టాలు ఎక్కువగా ఉండటంతో అప్పటి ప్రభుత్వం ఈ వంతెనలను నిర్మించారు. నిర్మించిన కొద్ది కాలానికి బీడ్జీ మధ్య నెర్రలిచ్చి ఇనుప సువ్వలు బయటపడి గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతలకు సిమెంట్ పెట్టి తాత్కాలిక మరమ్మత్తులు మాత్రమే చేశారు. సాకివాగుపై నిర్మించిన హై లెవెల్ బ్రిడ్జికి సమీపంలోని బ్రిడ్జి మధ్య గుంతలు పడి సువ్వలు బయటపడ్డాయి. అంతకు ముందు పడిన గుంతలకు మరమ్మతులు చేసిన ప్రక్కనే మరొక కొత్త గుంతపడి సువ్వలు బయటపడ్డాయి. ఈ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. ఈ రోడ్డులో నిర్మించిన బ్రిడ్జిల పరిస్థితి ఇలాగే ఉంది. ఆర్ అండ్ బి అధికారులు వెంటనే స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని సిఐటియు నాయకులు కె శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు బి శంకరయ్య కోరుతున్నారు. రాత్రి వేళలో ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. బ్రిడ్జిల్లోని స్లాబ్కు పడిన గుంతలు పెద్దవి కాకముందే చర్యలు చేపట్టాలని కోరారు.



మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం

అంబేద్కర్ విగ్రహం వద్ద వివాదం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఏడాది క్రితం మార్కెట్ యార్డ్ వద్ద రేపల్లె రహదారిలో పెట్రోల్ బంకు ఎదురుగా ఆర్అండ్బి స్థలంలో అంబేద్కర్ అర్థ ఫోటో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో దళిత రాజ్యం పేరుతో పలువురు కమిటీగా ఏర్పడ్డారు. అయితే విగ్రహాన్ని ఏర్పాటు చేసిన అనంతరం ఏ ఒక్కరు దీని గురించి పట్టించుకోకపోవడంతో కమిటీల సభ్యుడిగా ఉన్న మోజేష్ అనే వ్యక్తి దీనిని శుభ్రపరిచి అంబేద్కర్ భవనం పేరుతో షెడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పాడు. దీనితోపాటు బ్రతుకు దెరువు కోసం ఇక్కడే బడ్డీ కొట్టు ఏర్పాటు చేసుకున్నానని తెలిపారు. దీనిని ఓర్వలేని దళిత రాజ్యం సభ్యులు పలువురు తనపై అసత్య ఆరోపణలు చేస్తూ తనపై దాడి చేసేందుకు ప్రయత్నించారని మోజేష్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను శనివారమే ఈ కొట్టును ప్రారంభించుకున్నానని, కావాలనే దురుద్దేశంతో దళిత రాజ్యం సభ్యులుగా చెప్పుకునే యాన్నాం సురేష్, కంభం సురేష్, వ్యవస్థాపక అధ్యక్షులు జాలద ఇస్సాకు, పిజి అరుణ శాస్త్రి తాను గుట్కా, సిగరెట్ వంటి సాంఘిక కార్యకలాపాలు చేపడుతున్నానని ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మాత్రం జాలాది ఇస్సాకు అందజేశారు. కానీ మిగిలిన అభివృద్ధి కార్యక్రమాల వ్యవహారంలో ఏ ఒక్కరూ తనకు తోడ్పాటు అందించలేదని, తాను ఒక్కడినే అంబేద్కర్ విగ్రహ ప్రాంతంలో సమావేశ మందిరం ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పాడు. అయితే అందరి తోడ్పడుతూ మరింత అభివృద్ధికి కృషి చేస్తారని ఆశించానని, తనపైనే అసత్య ఆరోపణ చేయటం సరికాదని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా మోజేష్ వ్యవహార శైలి నచ్చకపోవడంతో దళిత రాజ్యం నుండి అతనిని వదిలేసామని, సమావేశ మందిర అభివృద్ధిలో తానొక్కడే చేసినట్లుగా చెప్తున్న మాటల్లో వాస్తవం లేదని వ్యవస్థాపక అధ్యక్షులు జాలాది ఇస్సాకు పేర్కొన్నారు.

ఐలవరం రహదారికి మోక్షం..!

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక గుంతల మయంగా మారిన ఐలవరం రహదారి పల్లె పండుగ కార్యక్రమం ద్వారా అభివృద్ధి కానుంది. ఈ రహదారి సుమారు పదేళ్లుగా గుంటలు ఏర్పడి వర్షా కాలంలో గ్రామం నుండి సుమారు కిలోమీటర్ల మేర జాతీయ రహదారి వరకు చేరుకునేందుకు గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో నక్కా ఆనందబాబు మంత్రిగా ఉన్న సమయంలో ఈ రహదారికి రూ.90లక్షల నిధులు కేటాయించారు. సిసి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ ఆ సమయంలో కొంత పని జరగగా ఎన్నికలు సమీపిం చటంతో ప్రభుత్వం మారింది. ఆ తర్వాత రహదారి పనులు నిలిచిపోయాయి. గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వైసీపీ ప్రభుత్వ పాలనలో సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు చొరవతో గ్రామంలోని పోస్ట్ ఆఫీస్ నుండి జెడ్పి ఉన్నత పాఠశాల వరకు సిసి రహదారి నిర్మించారు. అక్కడ నుండి అంకమ్మ గుడి వరకు గుంతల మయంగా మారి ప్రయాణికులకు ప్రాణ సంకటకంగా మారింది. మరోసారి తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో శాసన సభ్యులు నక్కా ఆనందబాబు చేతుల మీదుగా పనులు జరగనున్నాయి. పల్లె పండుగ ద్వారా ఈ రహదారి సిసి రహదారిగా నిర్మించేందుకు ఉపాధి హామీ పథకం నుండి రూ.50లక్షలు నిధులు మంజూరయ్యాయి. రహదారి నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు తొలగుతాయని ఎదురుచూస్తున్నారు.



అధ్వానంగా ఉన్న ఐలవరం రహదారి

ఇసుక క్వారీల్లో అదనపు వసూళ్లు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదలంక గ్రామంలోని కాకుల డొంక వద్ద కృష్ణా నదిలో ఉచిత ఇసుక కోసం ట్రాక్టర్లు కోలా హలంగా ఉన్నాయి. ఇదే అదునుగా చేసుకొని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ట్రాక్టర్కు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాక రీచ్లో ఇసుక ట్రాక్టరు ఇరుక్కుపోతే దానిని బయటికి లాగేందుకు నాయకులు జెసిబిలను కూడా ఏర్పాటు చేశారు. దానికి కూడా రూ.500 నుండి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నట్లు ట్రాక్టర్ యజమానులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ట్రాక్టర్లకు ఇసుకను నింపేందుకు ఆ ప్రాంతంలో ఉన్న కూలీలు మాత్రమే ఇసుకను నింపాలని, బయట వారు ఎవరు రావడానికి వీలు లేదంటూ హుకుం జారీ చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. గతంలో ప్రభుత్వం ఆక్షన్ ద్వారా ఇసుక రిచ్లను వేలంపాట దక్కించుకున్న వారు ట్రాక్టర్కు కూలీ నిమిత్తం రూ.400 నుండి రూ.500 వసూలు చేసేవారు. కానీ నేడు ట్రాక్టర్ ఇసుక నింపటానికి రూ.వెయ్యి వరకు కూలీలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇలాంటి ఖర్చులతో ట్రాక్టర్ ఇసుక గృహ నిర్మాణ దారులకు అందేసరికి దూరాన్ని బట్టి రూ.3వేల నుండి రూ.5వేల వరకు పలుకుతుందని, పేరుకే ఉచిత ఇసుక లబ్ధిదారులకు మాత్రం రూ.వేలల్లో వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంటుందని వాపోతున్నారు.



కాకుల డొంకలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

ఇసుక ట్రాక్టర్లతో లంక గ్రామాలు ఛిద్రం

మండలంలో ఉచిత ఇసుకను తరలించుకునేందుకు పెదలంక గ్రామంలోని కాకులు డొంక వద్ద కృష్ణానదిలోకి అనుమతిని ఇవ్వటంతో భట్టిప్రోలు, రేపల్లె, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం వంటి ప్రాంతాల నుండి ట్రాక్టర్లు ఈ రిచ్ వద్దకు అధిక సంఖ్యలో వస్తున్నాయి. వేల సంఖ్యలో వస్తున్న ట్రాక్టర్లు మోతతో పాటు, గ్రామాల్లో రహదారులు దుమ్ము ధూళితో చిత్రమవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ట్రాక్టర్ల రద్దీతో లంక గ్రామాలైన పెద్దలంక, పెసర్లంక, చింతమోటు గ్రామాల ప్రజలు రహదారిపై ప్రయాణించటానికి కూడా అవకాశం లేక ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. కనీసం రహదారిపై ద్విచక్ర వాహనం తప్పుకోవడనికి కూడా అవకాశం లేని విధంగా ట్రాక్టర్లు లంక గ్రామాల రహదారులపై పరుగులు తీస్తున్నాయని చెబుతున్నారు. ఎలాంటి నియంత్రణ లేని ఈ విధానంతో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయని వాపోతున్నారు. ప్రభుత్వం ఉచిత ఇసుక ప్రవేశపెట్టడం శుభపరిణామమని, కానీ దానివల్ల సమీప గ్రామ ప్రజలు ఇబ్బంది పడే విధంగా ఉండటం సరికాదని అంటున్నారు. దీనిపై ప్రభుత్వమే తగిన విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మేధాశక్తికి పోషకాహారం అవసరం

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం బాల, బాలికల్లో మేధాశక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని తల్లి, తండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్ టూ నీడి గ్రామీణ విద్యా కేంద్రం వ్యవస్థాప అధ్యక్షులు తోట సురేష్ బాబు అన్నారు. మండలంలోని అడవిపల్లెపాలెం ఎస్ టు నీడి విద్యా కేంద్రంలో ఆదివారం పోషకాహారంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల, బాలికలకు బలవర్ధకమైన ఆహార అందించేందుకు తల్లిదండ్రులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. విద్యతో పాటు ఆరోగ్య కరమైన ఆహారపు అలవాట్లు, వాటి ప్రాముఖ్యతను బాల, బాలికలకు తల్లిదండ్రులు తెలియజేయాలని అన్నారు. బాలలను చిరు తిండి వైపు నుంచి మళ్లించి బలమైన, సహజ సిద్ధమైన ఆహార పదార్థాలను అలవాటు చేయాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్య క్రమం తెలుసుకునే విధంగా ఎస్ టు నీడి సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జోగి నాని, ఉల్చి శ్రీనివాస్, యేనేమోలు, శ్రీనివాస్, ధనలక్ష్మి, శివగంగు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి, తండ్రులు, మహిళలు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆహార పదార్థాలు అందజేస్తున్న నిర్వాహకులు



అన్నదానం ప్రారంభిస్తున్న దృశ్యం

అన్నదానం ప్రారంభం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్లపల్లి అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్ప మాల ధార భక్తులకు ఈ నిత్య అన్నదాన కార్యక్రమం డిసెంబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ మణికంఠ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ చుట్టుపక్కల ప్రాంతాల్లోని అయ్యప్ప భక్తులు, మాలధారులు మధ్యాహ్నం సద్ది కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కొరారు. నిత్య అన్నదానంకు భక్తులు సహాయ, సహకారాలు అందించాలని కోరారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిభిరానికి 61మంది హాజరైనట్లు క్లబ్ క్యాంప్ చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య తెలిపారు. వీరిలో 45మందికి శుక్లంల ఆపరేషన్లు చేయాలని వైద్యులు నిర్ణయించారని తెలిపారు. వీరందరికీ గుంటూరు జిల్లా పెదకాకాని దగ్గర ఉన్న శంకర్ నేత్రాలయంలో ఉచితంగా కంటి శుక్లంల ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేషా వలి, బత్తుల వీరనారాయణ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంగులూరులో గతంలో అనేక వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. తాము నిర్వహించే వైద్యసేవలకు శంకర్ నేత్రాలయం సహకారం ఎంతో ఉందని చెప్పారు. భవిష్యత్తులో ఇదే విధంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. పేదలు ఈ అవకాశాలను ఉపయోగం చేసుకోవాలని కోరారు. రోటరీ క్లబ్ భవన్ దగ్గర జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రుతుజ, శంకర్ నేత్రాలయం వైద్య సిబ్బంది, రోటరీ సభ్యులు రాయిని రామారావు, గుర్రం ఆంజనేయులు, గరిమిడి జగన్మోహన్రావు, పోలిశెట్టి సీతారామయ్య పాల్గొన్నారు.



దీపావళి మందుల గోడౌన్ తనిఖీ చేస్తున్న ఎస్ఐ

బాణాసంచా గోడౌన్లలో తనిఖీ

ప్రజాశక్తి - వేటపాలెం

దీపావళి పండుగ నేపథ్యంలో క్రాకర్స్ గోడౌన్స్ ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు ఆదివారం తనిఖీ చేశారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని గోడౌన్ యజమానులను ఆదేశించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. దీపావళి దుకాణాల లైసెన్సు, సేఫ్టీ ప్రికాషన్స్ చెక్ చేశారు. అక్కయ్యపాలెం పంచాయతీలో రెండు క్రాకర్స్ గోడౌన్స్ ఉన్నట్లు తెలిపారు.

క్లోరినేషన్ చేయిస్తాం : ఎంపిడిఒ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకుల్లో తప్పకుండా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో శుభ్రత, క్లోరినేషన్ కార్యక్రమాన్ని చేపడతామని పుల్లలచెరువు ఎంపిడిఒ వసంతరావు నాయక్ తెలిపారు. ఈనెల 26న ట్యాంకులను శుభ్రం చేసేదెప్పుడో..? అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఎంపిడిఒ వసంతరావు నాయక్ మాట్లాడుతూ పుల్లలచెరువు మండల పరిధిలోని ముటుకుల సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, వివిధ గ్రామ పంచాయతీల్లోని మంచినీటి ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ కార్యక్రమాన్ని సంబంధిత సర్పంచుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో చేపడతామని ఆయన తెలిపారు. ఇంకా ఎక్కడైనా ట్యాంకుల నుంచి నీరు దుర్వాసన వస్తున్నట్లు ప్రజలు తెలియజేస్తే వెంటనే తగు చర్యలు చేపట్టి వాటిని శుభ్రం చేయిస్తామని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఎ. శాస్త్రి

ఇపిఎఫ్ పెన్షనర్ల

సమస్యలు పరిష్కరించాలి

- హయ్యర్ పెన్షను దరఖాస్తులను పరిష్కరించాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు
- ఎపిఆర్‌పిఎ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశంలో 75 లక్షలకు పైగా ఉన్న ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలు పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఎ. శాస్త్రి అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. తొలుత ఇటీవల చనిపోయిన వారికి సంతాప తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఎ.శాస్త్రి మాట్లాడుతూ ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యలపై రీజనల్ కార్యాలయాల్లోని అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఆయన ఖండిస్తున్నామన్నారు. ఇపిఎఫ్ పెన్షనర్ల చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ పరిస్థితి మారకపోతే భవిష్యత్తులో నిరసన చేపడతామని అధికారులను హెచ్చరించారు. రీజనల్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న హయ్యర్ పెన్షను దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అందరికీ హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు కార్యక్రమాల నివేదిక ప్రవేశ పెట్టి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రెండున్నర లక్షల మంది ఇపిఎఫ్ పెన్షనర్లు కనీస పెన్షను రూ.1000 పొందలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. వారందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సామాజిక పెన్షను రూ.4,000 మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బకాయి డిఎ, పిఆర్‌సి అరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు. రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పిఆర్‌సి ప్రకటించి ఐఆర్ విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులకు 8వ పిఆర్‌సి ప్రకటించి ఐఆర్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పెన్షనర్లు నవంబర్ 16న పెన్షనర్స్ విద్రోహ దినాన్ని జయప్రదం చేయాలని, నిరసనలో పాల్గొనాలని తీర్మానించారు. డిసెంబర్ 17న పెన్షనర్స్ డే జయప్రదం చేయాలని, 2025 జనవరి 28న విజయవాడలో పెన్షనర్స్ సమస్యలపై రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించడానికి ఎపిఆర్‌పిఎ మద్దతు ఇవ్వాలని తీర్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జి.శేషయ్య, సిహెచ్. రాంబాబు ప్రకాశం జిల్లా నాయకుడు కె. శివశంకర్రావు, గుంటూరు జిల్లా నాయకుడు జి.చంద్రమౌళి, నెల్లూరు జిల్లా నాయకుడు యుఎస్ఎన్. రెడ్డి, వివిధ జిల్లాల నాయకులు సిహెచ్. కాశీ విశ్వనాథ్, షేక్ హుస్సేన్, కెపి కుమార్, ఎన్. రామకష్టారెడ్డి ఎన్.హరిచంద్ర రెడ్డి, ఎం ఆదినారాయణమూర్తి, జివి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టు సందర్శన

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని వెలిగొండ పోరాట సమితి ఉదయగిరి నాయకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు. సిపిఐ ప్రకాశం, నెల్లూరు కడప జిల్లాల నాయకులు వెలిగొండ ప్రాజెక్టును ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ప్రాజెక్టు పనులను పరిశీలించారు. పనులు ఎంత మేర పూర్తయ్యాయని ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తి అయితే మూడు జిల్లాలకు ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అదుతాయన్నారు. పొలాలకు మేలు కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం, వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రత్యేక నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలనికోరారు. ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసి 28 సంవత్సరాలు



వెలిగొండ ప్రాజెక్టు సందర్శనలో నాయకులు

దాటుతున్నప్పటికీ నేటికీ పూర్తి కాకపోవడం ఈ ప్రాంత ప్రజల పట్ల పాలక వర్గాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందన్నారు. తీగలేరు కాలువ మరమ్మతు పనులు చేయాలని కోరారు. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిన పశ్చిమ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతూ వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాధారం తప్ప మరో నీటి ప్రత్యామ్నాయం లేని ఈ ప్రాంతానికి కష్ణా జలాలే పరిష్కార మార్గమని నాడు సిపిఐ రూపొందించిన మార్గమే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణమని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు, ఉమ్మడి కడప జిల్లాలోని దాదాపు 32 మండలాల పరిధిలోని మూడు లక్షల ముప్పై రెండువేల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మందికి తాగునీరు అందుతుందన్నారు. అత్యంత కీలకమైన వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకుడు తిరుమలయ్య, డెమోక్రసీ నాయకులు గుండా రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, సిపిఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగ అభివృద్ధికి కృషి

- నేత కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం
- నైపుణ్యాభివృద్ధి కోసం కామన్ ఫెసిలిటి సెంటర్లు
- జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి నాగమల్లేశ్వరరావు



ముఖాముఖి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చేనేత రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి కె. నాగమల్లేశ్వరరావు తెలిపారు. చేనేత కార్మికుల స్థితిగతులను మెరుగుపరచి వారి జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చేనేత రంగానికి ఆదరణ తగ్గి నేత కుటుంబాలు జీవనం కోసం వేరే ఉపాధి మార్గాల వైపు వెళ్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో నేతన్నలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో చేనేతరంగ అభివృద్ధికి తీస ుకుంటున్న చర్యల గురించి నాగమల్లేశ్వరరావు ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే...

బాపట్ల జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 16 మండలాలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో సుమారు 9 వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. 1,968 మంది సహకార రంగంలో,14,670 మంది సహకారేతర రంగం, 1,500 మంది చేనేత అనుబంధ వృత్తుల్లో ఉన్నారు. జిల్లాలో 10 వేల నేత మగ్గాలు, 71 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ప్రస్తుతం 33 సంఘాలు మాత్రమే మనుగడలో ఉన్నాయి. త్వరలోనే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం కసరత్తు చేస్తున్నారు.

నైపుణ్యాభివృద్ధి కోసం కామన్ ఫెసిలిటి సెంటర్లు

చేనేత వృత్తిపై జీవిస్తున్న వారి నైపుణ్యాభివృద్ధి కోసం 12 కామన్ ఫెసిలిటి సెంటర్ల నిర్మాణానికి 2016 లోనే నిధులు మంజూరయ్యాయి. రేపల్లె, చెరుకుపల్లి, ఈపురుపాలెం, తోటవారిపాలెం, దేశాయిపేట, రామన్నపేట, రామకృష్ణాపురం, చేనేతపురి, వేటపాలెం, మార్టూరు మండలం కొంద మంజులూరులో కామన్ ఫెసిలిటి సెంటర్లు నిర్మిస్తున్నారు. ఒక్కొక్క సెంటర్ కోసం రూ 50 లక్షల నిధులను ఖర్చు చేస్తారు. 500 నుంచి 700 మంది చేనేతలు ఉన్న ప్రాంతాన్ని క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. రూ 31.50 లక్షల భారీ షెడ్ నిర్మాణం,మిగతా నిధులతో నేత పరికరాలు, మగ్గాలు,ఇతర యంత్రాలు, సౌకర్యాల కల్పనకు ఖర్చు చేస్తారు.ఈ కేంద్రాల్లో మగ్గాలు ఏర్పాటు చేసి సులువుగా పని చేసుకునేందుకు అవసరమైన యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచుతారు. వృత్తి నైపుణ్యాన్ని అందజేస్తారు. ఇప్పటి వరకు జిల్లాలో 8 కామన్ ఫెసిలిటి సెంటర్ నిర్మాణాలు పూర్తి అయ్యాయి. కొంద మంజులూరు, పేటేరు, రేపల్లె,చెరుకుపల్లిల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. వాటిని పూర్తి చేసే చర్యలు తీసుకుంటున్నారు. నిర్మాణాలు పూర్తయిన సెంటర్లలో కావాల్సిన మౌళిక సదుపాయాలు కల్పించి, శిక్షణ పరికరాలు, మగ్గాలు తెప్పించి త్వరలోనే వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. సంతమాగులూరులో కొత్త క్లస్టర్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపారు. రూ.2 కోట్ల అంచనాలతో చేనేత క్లస్టర్ పథకం ద్వారా అభివృద్ధికి ఆధునిక డిజైన్లలో శిక్షణ, మగ్గం పరికరాల సరఫం, ఆధునిక డిజైనలను అందించడం, వ్యక్తిగత వర్క్ షెడ్లు, కామన్ వర్క్ షెడ్లు, కాంపోనెంట్ల క్రింద లబ్ధి చేకూర్చుతారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వానికి నివేదిక పంపారు. చేనేతల అభివృద్ధి కోసం జిల్లాలో క్లస్టర్ పథకం ద్వారా 2 క్లస్టర్లకు రూ.4 కోట్ల మంజూరయ్యాయి. రేపల్లెలో ఒకటి, బట్టిప్రోలు మండలం ఐలవరంలో మరొకటి మంజూరయ్యాయి. వీటి ద్వారా 530 చేనేత కార్మికులు లబ్ధి పొందుతున్నారు. ఈ క్లస్టర్ ద్వారా 43 వ్యక్తిగత వర్క్ షెడ్లకు ఆమోదం పొంది నిర్మాణం పూర్తయ్యింది. క్లస్టరేతర పథకం ద్వారా 169 మంది వ్యక్తిగత వర్క్ షెడ్ల ఆమోదం పొందారు. అవి నిర్మాణ దశలో ఉన్నాయి.

చేనేత కార్మికుల అభివృద్ధికి స్వర్ణాంధ్ర - 2047

గత ఆగస్టులో నిర్వహించిన చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లాలోని దేవాంగపురిలో జరిగిన సభలో జిల్లాలో చేనేత రంగ అభివృద్ధి కోసం చేనేత, జౌళిశాఖ మంత్రి, ఎంపీలు పలు హామీలు ఇచ్చారు. చీరాలలో చేనేత పార్కు ఏర్పాటు, చీరాల కుప్పడం పట్టు చీరలకు జియోట్యాగ్ వచ్చేలా కషి, 2019కి ముందు ఉన్న చేనేత సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తామని చెప్పారు. ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్రారంభం, నేతన్నల కోసం శిక్షణ కేంద్రాలు ఏర్పాటు, చేనేత వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం కల్పన,నూతన డిజైన్ల కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. నేత మగ్గంతో పాటు అనుబంధ వృత్తులైన పడుగు పట్టడం, ఆసు పోయడం, కండెలు చుట్టడం, అచ్చు అతకడం, రంగులు అద్దడం లాంటి వాటిల్లో ఉన్న చేనేత ఉప వృత్తుల వారికి కూడా మేలు జరిగేలా చర్యలు తీసు కుంటామన్నారు. ఈమేరకు జిల్లాలో చేనేత కార్మికుల అభివృద్ధికి స్వర్ణాంధ్ర - 2047లో భాగంగా దశల వారీ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ఎన్‌టిఆర్ భరోసా పెన్షను పథకం క్రింద చేనేత రంగంలో 50 సంవత్సరాలు పైబడిన 7,443 కార్మికులకు ప్రతి నెల రూ 4 వేలు చొప్పున పింఛను అందిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి కె. నాగమల్లేశ్వరరావు తెలిపారు.